

మిర్చి ధర మరింత పతనం

రోజు రోజుకూ మిర్చి ధరలు పతనమవుతున్నాయి. గత ఏడాది క్వింటా రూ.21 వేలు పలికిన మిర్చి ప్రస్తుతం రూ.9 వేలకు మించడం లేదు. - 8లో..



పొట్టిశ్రీరాములు త్యాగం మరువలేం

అమరజీవి పొట్టి శ్రీరాములు త్యాగం మరువలేమని కలెక్టర్ తమీమ్ అన్సారియా అన్నారు. పొట్టి శ్రీరాములు జయంతి ఉత్సవాల్లో ఆమె మాట్లాడారు. - 8లో..

వాతావరణం

గరిష్టం/కనిష్టం 36 /25

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. ఒకటి రెండు చోట్ల ఉరుములు మెరుపులతో జల్లులు పడవచ్చు. ఉక్కపోతగా ఉంటుంది.

న్యూస్‌రీల్

ఏఐయూ పెన్‌కాక్ సిలాట్ పోటీల్లో ఏకేయూ విద్యార్థికి స్వర్ణం



పోటీల్లో బంగారు పతకం సాధించిన కె.ప్రేమ్‌కుమార్

ఒంగోలు సిటీ: అఖిల భారత స్థాయిలో కర్ణాటక రాష్ట్రంలోని నార్త్ బెంగళూరు యూనివర్శిటీలో ఈనెల 14వ తేదీ నుంచి జరుగుతున్న ఆల్ ఇండియా ఇంటర్ యూనివర్శిటీ పెన్‌కాక్ సిలాట్ పోటీల్లో ఆంధ్ర కేసరి యూనివర్శిటీ తరఫున పాల్గొన్న పురుషుల జట్టులో కే.ప్రేమ్ కుమార్ బంగారు పతకాన్ని కైవసం చేసుకున్నారు. తొలి సంవత్సరం లోనే ఏకేయూ క్రీడాకారులు జాతీయ స్థాయిలో జరిగిన క్రీడల్లో తమ ప్రతిభా పాటవాలను ప్రదర్శించి ఏకేయూ కీర్తి ప్రతిష్టలను ఇనుమడింప జేయడంపై యూనివర్శిటీ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ డి.వి.ఆర్.మూర్తి, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ బి.హరిబాబు బుధవారం సాయంత్రం హర్షం వ్యక్తం చేశారు. ప్రేమ్‌కుమార్ ఏకేయూ పరిధిలోని ఒంగోలులో ఉన్న ఇందిరా ప్రియదర్శిని లా కాలేజీలో ఎల్ఎల్‌బీ మొదటి సంవత్సరం చదువుతున్నారు. ప్రేమ్ కుమార్‌ను అభినందించిన వారిలో ఏకేయూ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ జి.రాజమోహన్ రావు, వైస్ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఎస్ నిర్మలామణి, సి.డి.సి డీన్ అండ్ డైరెక్టర్ ఆఫ్ అడ్మిషన్ ప్రొఫెసర్ జి.సోమశేఖర, ఫిజికల్ ఎడ్యుకేషన్ విభాగం డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ ఐ.దేవీవర ప్రసాద్ , ఇందిరా ప్రియదర్శిని లా కళాశాల చైర్మన్ డాక్టర్ కే.నరసింగరావు, సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ సి.వి.రామ కృష్ణారావు, ప్రిన్సిపాల్ డాక్టర్ కే.నటరాజ కుమార్ ఉన్నారు.

పీహెచ్‌సీల్లో మెరుగైన వైద్య సేవలు అందించాలి

- వైద్యశాఖపై సమీక్షలో కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా



వైద్య శాఖ అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా

ఒంగోలు సబర్బన్: ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో (పీహెచ్‌సీ) పనిచేస్తున్న డాక్టర్లు మెరుగైన సేవలు అందించాలని కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా పిలుపునిచ్చారు. ప్రకాశం భవనంలో కలెక్టర్ చాంబర్‌లో బుధవారం వైద్యశాఖపై ప్రత్యేక సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పీహెచ్‌సీల్లో చేస్తున్న సేవలకు మంచి గుర్తింపు రావాలన్నారు. గతంతో పోల్చితే ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రసవాల సంఖ్య పెరిగిందన్నారు. అయితే ప్రైవేటు ఆస్పత్రులతో పోటీపడి మరీ పనిచేయాలని వైద్యులను ఆదేశించారు. గర్భిణులకు అవసరమైన వైద్య పరీక్షలు, హైరిస్క్ కేసులు, ప్రభుత్వ ఆస్పత్రుల్లో జరిగే ప్రసవాల వివరాలు ఎప్పటికప్పుడు ఆన్‌లైన్లో నమోదు చేయటం, తద్వారా ఎన్టీఆర్ వైద్య సేవ పథకం నుంచి వచ్చే ఆర్థిక ప్రయోజనాన్ని పొందటంలాంటి కార్యక్రమాలు చేపట్టాలన్నారు. బరువు తక్కువ పిల్లల జననం, ఇలాంటి పిల్లల ఆరోగ్య పరిస్థితిని బాలింతల ఇళ్లకు వెళ్లి పారా మెడికల్ సిబ్బంది నిరంతరం గమనించడం, మాతా–శిశు మరణాలు, వ్యాక్సినేషన్, దోమల వలన కలిగే వ్యాధులు, వేసవి దృష్ట్యా వచ్చే మూడు నెలల పాటు వడగాలుల వలన ప్రాణ నష్టం జరగకుండా చూసేలా కార్యాచరణ ప్రణాళిక రూపకల్పన తదితర అంశాలపై ఆమె సమీక్షించారు. సాంకేతిక సమస్యలుంటే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకురావాలని చెప్పారు. తక్షణమే యాప్‌లో నమోదు చేయడంలో కుదరకపోయినా వ్యాక్సినేషన్ వంటి ఫిజికల్‌గా చేయాల్సిన పని తక్షణమే చేయాలని కలెక్టర్ చెప్పారు. కార్యక్రమంలో డీఎంహెచ్‌ఓ వెంకటేశ్వర్లు, డిప్యూటీ డీఎంహెచ్‌ఓలు, ఎన్టీఆర్ వైద్యసేవ జిల్లా కోఆర్డినేటర్ హేమంత్, డీవీఓ పద్మజ, మండల మెడికల్ ఆఫీసర్లు ఇతర అధికారులు పాల్గొన్నారు.



జిల్లా విద్యాశాఖ కార్యాలయానికి అవినీతి చీడ పట్టుకుంది. ఇక్కడ ఫైళ్లు కదలాలంటే చేతులు తడపాల్సిందే. డిప్యుటేషన్‌పై వచ్చిన ఓ ఉద్యోగి వైఖరి ఆ కార్యాలయానికి మాయని మచ్చగా మారింది. వివిధ పనుల నిమిత్తం నిత్యం వచ్చే ఉపాధ్యాయులు, వివిధ స్కూళ్ల యాజమాన్యాలు, విద్యార్థుల తల్లిదండ్రులు అతని తీరుపై విసుగు చెందారు. రాజకీయ పలుకుబడిని ఉపయోగించి కార్యాలయంలో చక్రం తిప్పుతున్నాడన్న ఆరోపణలు జోరుగా వినిపిస్తున్నాయి.

> **ఫోర్త్ కేటగిరీ కింద పోస్టింగ్**
>
> పోక్సో కేసులో అరెస్టయి రిమాండ్ అనంతరం సదరు ఉపాధ్యాయునికి ఫోర్త్ కేటగిరీ కిందే పోస్టింగ్ ఇచ్చాం. జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో ఉద్యోగి అవినీతికి పాల్పడినట్లు తేలితే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటాం.
>
> – ఏ కిరణ్‌కుమార్, డీఈఓ, ఒంగోలు

చిన్నసారు పలుకు బడి!

- డీఈఓ కార్యాలయంలో అక్రమార్కుడి తిష్ట
- క్యాడర్ చిన్నదైనా.. పెత్తనమంతా ఆయనదే
- ఫైలు కదలాలంటే.. పైసలు రాల్చాల్సిందే..
- అధికార పార్టీ ఎమ్మెల్యేల పేరు చెప్పి బెదిరింపు
- కార్యాలయ సిబ్బందికి తలనొప్పిగా మారిన వైనం
- పోక్సో కేసు ఉపాధ్యాయుడికి పోస్టింగ్‌పై సర్వత్రా విమర్శలు

ఒంగోలు సిటీ: ఆ ఉద్యోగి క్యాడర్ చిన్నది కానీ ఆయన చేసే పనులు మాత్రం జిల్లా స్థాయి అధికారుల పనులు. జిల్లా విద్యాశాఖ అధికారి కార్యాలయంలో ఏ పని జరగాలన్నా ఆ చిన్న ఉద్యోగిని సంప్రదించాల్సిందే. చిన్న స్థాయి బిల్లుల దగ్గర నుంచి పై స్థాయి అనుమతుల వరకు ఫైల్ కదలాలంటే ఆయన చేతులు తడపాల్సిందేనంటున్నారు. ప్రైవేట్ పాఠశాలల రెన్యువల్స్, ఎయిడెడ్ పాఠశాలల విషయాల్లో కూడా భారీగా దండుకున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. కార్యాలయంలో పనిచేసే సిబ్బందిని సైతం వేధిస్తున్నాడన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. తన మాట వినకపోతే అధికార పార్టీ ఎమ్మెల్యే పీఏలతో ఫోన్ చేయించి మరీ బెదిరింపులకు పాల్పడుతున్నాడన్న ఆరోపణలు ఉన్నాయి.

ఏ ఫైలు కదలాలన్నా ...

జిల్లా విద్యాశాఖలో ఆయన చిన్న ఉద్యోగి. అయితే అంతా తానై వ్యవహరించడం గమనార్హం. ఏ చిన్న పాటి ఫైలు కదలాలన్నా ఆయన్ను దాటుకొని వెళ్లాల్సిందే. ఇక్కడ ప్రైవేట్ పాఠశాలల గుర్తింపు, రెన్యువల్, కొత్త పాఠశాలలకు పర్మిషన్‌కు సంబంధించి అంశాలన్నీ ఆయన కనుసన్నల్లోనే జరుగుతున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. ఇందుకు సదరు ఉద్యోగి భారీ ఎత్తున ముడుపులు తీసుకుంటున్నట్లు సమాచారం. ఏదైనా పని నిమిత్తం కార్యాలయానికి వచ్చిన కొందరు ఉపాధ్యాయులకు ముందుగానే పని అయ్యేందుకు ఇంత ఖర్చవుతుందని చెప్పుండడం..అతని అవినీతి ఏ స్థాయిలో ఉందో అర్థం చేసుకోవచ్చు. కార్యాలయంలో సిబ్బందిని సైతం తాను చెప్పిన పని చేయకపోతే వేధింపులకు గురి చేస్తున్నట్టు గుసగుసలు వినిపిస్తున్నాయి. కొన్ని సందర్భాల్లో అధికార పార్టీ ఎమ్మెల్యేలతో, వారి పీఏలతో సైతం ఫోన్లు చేయించి ఒత్తిడి చేయిస్తున్నట్టు ఆరోపణలు ఉన్నాయి. అలాగే ముడుపులు ఇవ్వని వారిపై ఎమ్మెల్యేలకు తప్పుడు ఫిర్యాదు చేస్తున్నట్టు సమాచారం. సదరు ఉద్యోగి నిర్వాకాలపై గతంలో ఉపాధ్యాయ సంఘాలు డీఈఓకు ఫిర్యాదు చేసినట్టు తెలిసింది. విచారణకు ఆదేశించారు కానీ ఎటువంటి చర్యలు తీసుకోలేదు.

డిప్యుటేషన్ మీద వచ్చి పెత్తనం..

నగరంలోని ఓ కళాశాలలో జూనియర్ అసిస్టెంట్‌గా పనిచేశాడు. రాజకీయ నాయకుల సిఫార్సుతో డీఈఓ కార్యాలయానికి డిప్యుటేషన్ మీద వచ్చాడు. ఉమ్మడి జిల్లాగా ఉన్నప్పుడు సదరు ఉద్యోగి ఓ డిప్యూటీ డీఈఓ కార్యాలయంలో పనిచేశాడు. ఆ సమయంలో ఎయిడెడ్ ఉపాధ్యాయుల సర్వీసుల విషయంలో భారీ ఎత్తున ఆరోపణలు వచ్చాయి. ప్రైవేటు స్కూళ్ల వద్ద కూడా ముడుపులు తీసుకున్నట్లు ఆయనపై అవినీతి ఆరోపణలు ఉన్నాయి. అతని వివరాలు సేకరించిన అధికారులు డిప్యుటేషన్‌పై తీసుకునేందుకు ఇష్టపడలేదు. అయినా పలుకుబడిని ఉపయోగించి డీఈఓ కార్యాలయంలో చేరాడు. ప్రస్తుతం ఆయనదే ఇక్కడ పెత్తనం. ఆయన్ను ప్రసన్నం చేసుకుంటే ఎలాంటి పనైనా క్షణాల్లో అయిపోతుందన్న ప్రచారం జోరుగా సాగుతోంది.

పోక్సో కేసు ఉపాధ్యాయుడికి పోస్టింగ్..

కారుమంచి జెడ్పీ హైస్కూల్‌లో నాలుగో తరగతి చదువుతున్న బాలికను లైంగికంగా వేధించాడన్న కేసులో ఉపాధ్యాయుడిపై పోక్సో కేసు పెట్టి అరెస్టు చేసి రిమాండ్‌కు పంపారు. రిమాండ్ నుంచి బయటకు వచ్చిన సదరు ఉపాధ్యాయుడిని ఉపాధ్యాయ సంఘ నాయకులు డీఈఓ, అధికార పార్టీ ఎమ్మెల్యే వద్దకు వెళ్లి పోస్టింగ్ ఇవ్వాలని కోరారు. సదరు ఉపాధ్యాయుడికి జిల్లా కేంద్రానికి సమీపంలో పోస్టింగ్ ఇవ్వడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. పోక్సో కేసు నమోదైన సదరు ఉపాధ్యాయుడికి నెలలు తిరక్కుండానే పోస్టింగ్ ఇవ్వడంపై పెద్ద ఎత్తున ముడుపుల వ్యవహారం నడిచిందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇందులోనూ ఈ ఉద్యోగి కీలకంగా వ్యవహరించాడని ప్రచారం జరుగుతోంది.

వక్ఫ్ సవరణ చట్టం రద్దుచేయాలి

- ఏపీ మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ షంషేర్ ఆలీబేగ్



మాట్లాడుతున్న షంషేర్ ఆలీబేగ్ తదితరులు

మార్కాపురం: కేంద్ర ప్రభుత్వం ముస్లింల మనోభావాలను దెబ్బతీసేలా ఇటీవల తయారు చేసిన వక్ఫ్ సవరణ చట్టంను వెంటనే రద్దుచేయాలని ఏపీ మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ డాక్టర్ మీర్జా షంషేర్ ఆలీబేగ్ డిమాండ్ చేశారు. పట్టణంలోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో బుధవారం పార్టీ నాయకులు, ప్రజా ప్రతినిధులతో కలిసి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మైనార్టీ హక్కులకు భంగం కలిగించేలా ఉన్న ఈ చట్టం రాజ్యాంగ విరుద్ధమని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సుప్రీం కోర్టులో సవాలు చేసిందని తెలిపారు. నూతన చట్టంలో వక్ఫ్ నిర్వచనాన్ని మార్చారన్నారు. కొన్ని శతాబ్దాలుగా ఉన్న మసీదులు, ముస్లిం శ్మశాన వాటికలు, దర్గాలు, ముస్లిం మత ప్రదేశాలన్నీ కూడా ఎలాంటి డీడ్స్ లేకపోయినా వక్ఫ్‌బోర్డుల పరిధిలో కొనసాగుతూ వక్ఫ్ ఆస్తులుగా ఉన్నాయని అన్నారు. నూతన చట్టం ప్రకారం వాటన్నింటిపై బోర్డుకున్న హక్కు తొలగిపోతుందని చెప్పారు. దీని ద్వారా ఆస్తుల స్వాధీనం లేదా పునర్ వర్గీకరణకు అవకాశం ఏర్పడుతుందన్నారు. దీంతో లెక్కలేనన్ని చారిత్రక, సాంస్కృతిక, వారసత్వానికి ప్రతీకగా నిలిచే ప్రదేశాలను కోల్పోవాల్సి వస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. నూతన చట్టంలో వక్ఫ్‌బోర్డు సీఈఓగా ముస్లిం వ్యక్తే ఉండాలన్న నిబంధనను తొలగించడంతో పాటు సెంట్రల్ వక్ఫ్ కౌన్సిల్, వక్ఫ్ బోర్డులో ముస్లిమేతరులకు అవకాశం కల్పిస్తారని అన్నారు. ఇవి తమ హక్కులకు భంగం కలిగించడమేనని, మతాల మధ్య ఉన్న సామరస్యాన్ని దెబ్బతీయడమేనని చెప్పారు. ముస్లింల ప్రాథమిక హక్కుల కల్పనకు వ్యతిరేకంగా ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. బోర్డులో ముస్లిమేతరులకు అవకాశం కల్పించడం చట్టవిరుద్ధమని అన్నారు. ఏ వక్ఫ్ ఆస్తినైనా ప్రభుత్వ ఆస్తిగా ప్రకటించే అధికారాన్ని అధికారులకు కట్టబెడుతున్నారని, ఇది ముస్లిం ధార్మిక సంస్థలను బలహీనపరచడమే అన్నారు.

ముస్లింలే లక్ష్యంగా..

ముస్లింలు, వారి ధార్మిక సంస్థను లక్ష్యంగా చేసుకుని నూతన బిల్లును ప్రభుత్వం తయారు చేసిందని షంషేర్ ఆలీబేగ్ ఆరోపించారు. రాజ్యాంగ విరుద్ధం కాబట్టే ఈ చట్టాన్ని సవాలు చేస్తూ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సుప్రీంకోర్టులో పిటిషన్ వేసిందన్నారు. సమావేశంలో నియోజకవర్గ వైఎస్సార్ సీపీ మైనార్టీ సెల్ అధ్యక్షుడు కౌన్సిలరు సలీమ్, కోఆప్షన్ సభ్యులు అమీరుల్లాఖాన్, కౌన్సిలర్ సెక్షావలి, కరీముల్లా, రిటైర్డు వార్డెన్ నజీర్ అహ్మద్, మైనార్టీ నాయకులు ఫరతుల్లా బేగ్, ఇస్మాయిల్, గౌస్ మొహిద్దీన్, కరీమ్‌బాషా, సీయం ఖాశీం, న్యాయవాది ఆసిఫ్‌ఖాన్, కోఆప్షన్ సభ్యులు మహమ్మద్ రఫీ, గఫూర్ మహబూబ్ బాషా, సోషల్‌మీడియా రఫీ, మున్వర్, మౌలాలీ, షాదీఖానా ప్రెసిడెంట్ ఇస్మాయిల్, ఉస్మాన్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు సర్టిఫికెట్లు ఇవ్వకపోతే చర్యలు

- ఫీజు కట్టలేదని విద్యార్థులను ఇళ్లకు పంపితే సహించేది లేదు
- హాల్ టికెట్లు ఇవ్వకుండా, పరీక్షలు రాయనీయకపోతే కఠిన చర్యలు
- మధ్యలో మానేసిన విద్యార్థులకు సర్టిఫికెట్లు ఇవ్వకపోయినా చర్యలే
- కళాశాలల యాజమాన్యాలను హెచ్చరించిన కలెక్టర్

సాక్షి ఎఫెక్ట్..

ఒంగోలు సబర్బన్: ప్రభుత్వం నుంచి ఫీజురీయింబర్స్ రాలేదని, ఫీజులు కట్టాలని విద్యార్థులను కళాశాలల యాజమాన్యాలు ఇబ్బంది పెడితే కఠిన చర్యలు తప్పవని కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా హెచ్చరించారు. 'సాక్షి' ప్రధాన సంచికలో బుధవారం "ఫీజుల షెడ్యూలుకు బూజు...గతి తప్పిన ఫీజు రీయింబర్స్‌మెంట్...ఊసేలేని వసతి దీవెన" శీర్షికన కథనం ప్రచురితమైంది. దీనిపై కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా స్పందించారు. ఆమేరకు ఆమె బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. జిల్లాలో అర్హత కలిగిన ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈబీసీ, మైనారిటీ విద్యార్థినీ, విద్యార్థులను రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ ద్వారా మెట్రిక్ అనంతర ఉపకార వేతనాల విషయంలో ఇబ్బందులు పెట్టవద్దని కళాశాల యాజమాన్యాలు, కళాశాలల ప్రిన్సిపాల్స్‌ను కలెక్టర్ హెచ్చరించారు. జిల్లాలోని వివిధ కళాశాలల యాజమాన్యాలు విద్యార్థులను పరీక్షలు రాయడానికి అనుమతించకుండా, కళాశాల ఫీజు చెల్లించాలని డిమాండ్ చేస్తూ వారిని ఇంటికి తిరిగి పంపిస్తున్నారని, కోర్సు పూర్తయిన విద్యార్థులకు సర్టిఫికెట్స్ ఇవ్వకుండా ఇబ్బంది పెట్టుతున్నారని తమ దృష్టికి వచ్చిందన్నారు. డిటైన్డ్, డిస్కంటిన్యూ అయిన విద్యార్థులకు కూడా సర్టిఫికెట్స్ ఇవ్వకుండా ఇబ్బంది పెట్టుతున్నారన్న ఫిర్యాదులు వస్తున్నాయని, వివిధ దిన పత్రికల్లో కథనాలు ప్రచురితం అవుతున్నాయన్నారు. విద్యార్థులు పోస్ట్ మెట్రిక్ స్కాలర్‌షిప్‌ల కింద ఫీజు రీయింబర్స్‌మెంట్‌కు అర్హులు అయినప్పటికీ వారి సర్టిఫికెట్స్ ఇవ్వకుండా ఇబ్బందులకు గురి చేయటం సరికాదన్నారు. విద్యార్థులు తమ కళాశాల విద్యను విడిచిపెట్టి, ప్రత్యామ్నాయ జీవనోపాధిని కోరుకునేలా కళాశాలల యాజమాన్యాల చర్యలు ఉన్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇలాంటి పరిస్థితులు కల్పిస్తున్న కళాశాల యాజమాన్యాల ప్రవర్తన ఆమోదయోగ్యం కాదని హెచ్చరించారు. కళాశాల యాజమాన్యం, ప్రిన్సిపాల్స్ పోస్ట్ మెట్రిక్ స్కాలర్‌షిప్ పథకం కింద అర్హత కలిగి ఉన్న విద్యార్థులకు హాల్ టిక్కెట్లు జారీచేసి వారికి ఎటువంటి అసౌకర్యం కలగకుండా తరగతులు, పరీక్షలకు హాజరు కావడానికి అనుమతి ఇవ్వాలని స్పష్టం చేశారు. పోస్ట్ మెట్రిక్ స్కాలర్‌షిప్ మంజూరు కోసం వేచి ఉండకుండా, కోర్సు పూర్తయిన వెంటనే విద్యార్థుల సర్టిఫికెట్లను వారికి ఇవ్వాలని ఆదేశించారు. ఆదేశాలను ఉల్లంఘించిన కళాశాలలపై అవసరమైన చర్యలు తీసుకోవడానికి ఏపీఎస్‌సీహెచ్‌ఈకి, యూజీసీ సిఫార్సు చేస్తామని హెచ్చరించారు.

డెత్ సర్టిఫికెట్‌కు రూ.90 వేల లంచం

- ఏసీబీకి చిక్కిన తహసీల్దార్, వీఆర్వోలు



విలేకరులతో మాట్లాడుతున్న డీఎస్పీ ఎస్ శిరీష



లంచం తీసుకుంటూ పట్టుబడిన తహసీల్దార్ సుజన్ కుమార్, దొడ్డవరం వీఆర్వో అంకమ్మరావు

మద్దిపాడు: డెత్ సర్టిఫికెట్ ఇచ్చేందుకు రూ.90 వేల లంచం అడిగిన తహసీల్దారును, వీఆర్వో ను ఏసీబీ డీఎస్పీ వలపన్ని పట్టుకున్న ఘటన మద్దిపాడులో బుధవారం జరిగింది. ఏసీబీ డీఎస్పీ ఎస్ శిరీష అందించిన వివరాల మేరకు మండలంలోని దొడ్డవరం గ్రామానికి చెందిన వల్లెపు అంకమ్మరావు భార్య చనిపోవడంతో ఆమె డెత్ సర్టిఫికెట్ కోసం ఆరు నెలలుగా తహసీల్దార్ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నాడు. ఈ క్రమంలో సర్టిఫికెట్ ఇచ్చేందుకు అంకమ్మరావును అదే గ్రామానికి వీఆర్వో గా పని చేస్తున్న కొప్పోలు అంకమ్మరావు ద్వారా తహసీల్దార్ సుజన్ కుమార్ రూ.90 వేల లంచం అడిగాడు. అయితే లంచం ఇవ్వడం ఇష్టంలేని వల్లెపు అంకమ్మరావు ఏసీబీని ఆశ్రయించాడు. ఏసీబీ డీఎస్పీ శిరీష సూచనలతో బుధవారం ఆ డబ్బులు తహసీల్దార్ కు అంకమ్మరావు ఇవ్వడానికి ప్రయత్నించగా వీఆర్‌ఓకి ఇవ్వాలని చెప్పాడు. దీంతో వీఆర్వోకు ఆ డబ్బులు ఇస్తుండగా ఏసీబీ అధికారులు దాడి చేసి పట్టుకున్నారు. అన్నంగి గ్రామంలో రీసర్వే జరుగుతున్న నేపథ్యంలో తహసీల్దార్ అక్కడకు వెళ్లగా అక్కడ మఫ్టీలో ఉన్న మరో టీం ఆయన్ను అదుపులోకి తీసుకున్నారు. ఇద్దరినీ గురువారం నెల్లూరులోని ఏసీబీ కోర్టుకు హాజరు పరచనున్నట్లు ఏసీబీ డీఎస్పీ తెలిపారు.

అకాల వర్షం..ఈదురుగాలులు

- జిల్లాలో 557 హెక్టార్లలో దెబ్బతిన్న పంటలు
- ఈ నెలలో రెండుసార్లు కురిసిన వర్షాలకు పంట నష్టం
- జిల్లాలో 400 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదు

ఒంగోలు సబర్బన్: జిల్లాలో వరుసపెట్టి కురుస్తున్న అకాల వర్షాలు, ఈదురుగాలుల ధాటికి రైతులు విలవిల్లాడుతున్నారు. ఆరుగాలం పండించిన వివిధ రకాల పంటలు నోటికాడికి వచ్చి దెబ్బతింటున్నాయి. ఈ నెలలో రెండు సార్లు అకాల వర్షాలు కురిశాయి. మంగళవారం అర్ధరాత్రి, బుధవారం తెల్లవారుజామున జిల్లాలోని 21 మండలాల్లో వర్షం కురవగా ఈ నెల 4వ తేదీన కూడా వర్షం పడింది. అకాల వర్షాలతో పాటు జిల్లాలో పలు చోట్ల నాలుగైదు రోజులుగా వీస్తున్న ఈదురు గాలులకు ఉద్యాన పంటలు, అరటి, బొప్పాయి తోటలు కూడా బాగా దెబ్బతిన్నాయి. అందులో అరటి, బొప్పాయి కలిపి దాదాపు 70 హెక్టార్లలో నష్టం వాటిల్లింది. ఈ నెల 4న కురిసిన వర్షాలకు సీఎస్‌పురం, వెలిగండ్ల, బేస్తవారిపేట మండలాల్లో పంటలు దెబ్బతిన్నాయి. బుధవారం కురిసిన వర్షానికి టంగుటూరుతో పాటు సీఎస్‌పురం, వెలిగండ్ల, బేస్తవారిపేట మండలాల్లో రెండోసారి కూడా పంటలు దెబ్బతిన్నాయి. మొత్తం మీద అకాల వర్షాలకు జిల్లాలో మొత్తం వ్యవసాయ, ఉద్యాన శాఖ పరిధిలో 557 హెక్టార్లలో పంటలు దెబ్బతినగా వాటిలో శనగ పంట 246 హెక్టార్లలో, మొక్కజొన్న 178 హెక్టార్లలో, వరి 52 హెక్టార్లలో, అలసంద 11 హెక్టార్లలో దెబ్బతింది. అన్ని పంటలు కలిపి మొత్తం 437 మంది రైతులు నష్టపోయినట్లు ప్రాథమిక అంచనాల ద్వారా తేల్చారు.

జిల్లాలో 400 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదు..

జిల్లాలో మంగళవారం అర్ధరాత్రి, బుధవారం తెల్లవారుజామున కలిపి 400 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైంది. మొత్తం 21 మండలాల్లో వర్షం కురిసింది. అత్యధికంగా సంతనూతలపాడు మండలంలో 60.8 మిల్లీ మీటర్లు, ఒంగోలులో 55.4, తాళ్లూరు 45.8, దర్శి 40.4, టంగుటూరు 28, జరుగుమల్లి 24.2, సింగరాయకొండ 22.2, కొండపి 21.4, కొత్తపట్నం 20.4, మద్దిపాడు 20.2, నాగులుప్పలపాడు 18.4, కురిచేడు 13, చీమకుర్తి 7.4, ముండ్లమూరు 5.2, పొన్నలూరు 4.2, పామూరు 3.4, వెలిగండ్ల 3, అర్థవీడు 2.2, యర్రగొండపాలెం 2, పొదిలి 2, దోర్నాలలో 1 మిల్లీ మీటరు వర్షం కురిసింది.



వర్షానికి తడవకుండా కల్లంపై కప్పిన పట్టలు

డీఎస్సీ పరీక్షలకు ఉచిత ఆన్‌లైన్ శిక్షణకు దరఖాస్తులు

ఒంగోలు సిటీ: మెగా డీఎస్సీ–2025 పరీక్షల ఉచిత ఆన్‌లైన్ శిక్షణకు అర్హులైన బీసీ, ఈడబ్ల్యూఎస్ (ఈబీసీ), ఎస్సీ, ఎస్టీ అభ్యర్థుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ఏపీ బీసీ స్టడీ సర్కిల్ సంచాలకులు ఎం.అంజల బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. టెట్‌లోఅర్హత సాధించిన అభ్యర్థులు తమ విద్యార్హత నకళ్లు, టెట్ మార్కుల నకళ్లు, కుల ధ్రువీకరణ పత్రం నకలు, ఆదాయ ధ్రువీకరణ పత్రం నకలు, ఆధార్ నకలు, 2 పాస్ పోర్టు సైజ్ ఫొటోలతో ఏపీ బీసీ స్టడీ సర్కిల్‌లో దరఖాస్తు చేసుకోవాల్సిందిగా కోరారు. వివరాలకు ఆఫీస్ ఫోన్ నంబరు 08592–231232, 99892 85530, 89850 90926 నంబర్లను సంప్రదించాలన్నారు.

క్లుప్తంగా

పోలీసు జీప్‌ను ఢీకొట్టిన ట్రక్



దెబ్బతిన్న పోలీసు జీపు

మార్కాపురం: ట్రక్ అదుపు తప్పి పోలీస్ జీపును ఢీకొట్టిన ఘటన బుధవారం మార్కాపురం మండలంలోని చింతగుంట్ల సమీపంలో చోటుచేసుకుంది. పోలీస్ జీప్ డ్రైవర్ అప్రమత్తంగా వ్యవహరించడంతో రాచర్ల ఎస్సై కోటేశ్వరరావు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. వివరాలు.. ఎస్సై కోటేశ్వరరావు మార్కాపురం నుంచి తన వాహనంలో రాచర్ల వెళ్తున్నారు. నంద్యాల నుంచి నర్సరావుపేటకు వెళ్తున ఐషర్ వాహనం చింతగుంట్ల సమీపంలో అదుపుతప్పి పోలీసు జీపును ఢీకొంది. ఐషర్ వాహనం మరమ్మతులు చేయించుకునేందుకు నర్సరావుపేట వెళ్తున్నట్టు తెలిసింది. ఈ క్రమంలో ప్రమాదం చోటుచేసుకోవడం గమనార్హం. సంఘటనా స్థలాన్ని మార్కాపురం రూరల్ పోలీసులు పరిశీలించారు.

ఇళ్ల నిర్మాణాలు త్వరితగతిన పూర్తి చేయాలి



మాట్లాడుతున్న కలెక్టర్ అన్సారియా

కనిగిరి రూరల్: గృహ నిర్మాణ లబ్ధిదారులు త్వరితగతిన నిర్మాణాలు పూర్తి చేయాలని కలెక్టర్ తమీమ్ అన్సారియా అన్నారు. స్థానిక మున్సిపాలిటీ పరిధిలోని అర్బన్ హౌసింగ్ కాలనీని బుధవారం ఆమె పరిశీలించారు. కాలనీలో 1390 ప్లాట్లు వేయగా, 544 మందికి ఇళ్లు మంజూరు చేశారన్నారు. అందులో 128 ఇళ్ల నిర్మాణాలు పూర్తి కాగా మిగిలిన ఇళ్ల నిర్మాణాలు వివిధ దశల్లో ఉన్నాయని పీడీ శ్రీనివాస ప్రసాద్ కలెక్టర్‌కు వివరించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ గృహనిర్మాణం పూర్తికి యూనిట్ విలువ రూ.1.80 లక్షలకు అదనంగా ఎస్సీ, బీసీలకు అదనంగా రూ.50 వేలు, ఎస్టీలకు రూ.75 వేలు, ఆదివాసి గిరిజనులకు రూ.లక్ష చొప్పున ఆర్థిక సహాయాన్ని అందిస్తుందని తెలిపారు. లబ్ధిదారులు ఈ అదనపు ఆర్థిక లబ్ధి సదవకాశాన్ని వినియోగించుకొని సొంతింటి కల సాకారం చేసుకోవాలన్నారు. కలెక్టర్ వెంకట పర్యాటకాభివృద్ధి సంస్థ చైర్మన్ నూకసాని బాలాజీ, మున్సిపల్ చైర్మన్ గఫార్, ఆర్డీఓ కేశవర్ధన్‌రెడ్డి, తహసీల్దార్, గృహ నిర్మాణ సిబ్బంది పాల్గొన్నారు.

మిర్చి ధర మరింత పతనం

- ప్రస్తుతం క్వింటా మిర్చి ధర రూ.9 వేలు
- ధర దిగజారడంతో తీవ్రంగా నష్టపోతున్న రైతులు
- పెట్టుబడి కూడా చేతికి రాక ఇప్పటికే అప్పులపాలు
- కూలీల ఖర్చు రాదని చివరి కోత వదిలేసిన పరిస్థితి



బేస్తవారిపేట:

రోజురోజుకూ పతనమవుతున్న మిర్చి ధర రైతుల గుండెల్లో గుబులు పుట్టిస్తోంది. గత ఏడాది మంచి లాభాలు రావడంతో ఎన్నో ఆశలతో మిర్చి పంట సాగు చేసిన రైతులకు మార్కెట్‌లో ధర చూసి కళ్లు బైర్లు కమ్ముతున్నాయి. ఎకరానికి రూ.1.80 లక్షల పెట్టుబడి పెట్టి, ఎంతో శ్రమకోర్చి మిర్చి పండించిన రైతులకు సరైన మద్దతు ధర కల్పించడంలో కూటమి సర్కారు మీనమేషాలు లెక్కించడంతో అప్పుల ఊబిలో కూరుకుపోయారు. గత ఏడాది క్వింటా రూ.21 వేల వరకు పలికిన మిర్చి.. ఈ ఏడాది పంట కోత ఆరంభం నుంచే రూ.11 వేలకు పరిమితమైంది. తాజాగా మార్కెట్‌లో క్వింటా మిర్చి ధర రూ.9 వేలకు మించకపోవడంతో రైతులు తీవ్ర మనోవేదనకు గురవుతున్నారు. నెలన్నర క్రితం మిర్చికి మద్దతు ధర కల్పించేందుకు చర్యలు తీసుకుంటామని చెప్పిన సీఎం చంద్రబాబు.. కేంద్రానికి ఓ లేఖ రాసి చేతులు దులిపేసుకోవడంతో రైతులకు నిరాశే మిగిలింది. ఎగుమతులు పెంచేలా కేంద్రంపై ఒత్తిడి చేసి తద్వారా మద్దతు ధర కల్పిస్తామన్న సీఎం చంద్రబాబు మాటలన్నీ కేవలం ప్రకటనలకే పరిమితయ్యాయి.

జిల్లాలో అత్యధికంగా మిర్చి పశ్చిమ ప్రకాశంలోనే సాగవుతోంది. ఇక్కడి రైతులు ఈ ఏడాది దాదాపు 45,813 ఎకరాల్లో మిర్చి సాగు చేశారు. ఆది నుంచే మిర్చి సాగుకు ఆటంకాలు ఎదురైనా రైతులు వెనకడుగు వేయలేదు. ఒక వైపు వర్షాభావ పరిస్థితులు, మరోవైపు తుఫాన్లు రైతన్నలను వెంటాడాయి. వీటికి తోడు చీడపీడలు, తెగుళ్ల బారి నుంచి పంటను రక్షించుకోవడానికి రైతులు విపరీతంగా పురుగుమందులు వాడాల్సిన పరిస్థితి ఏర్పడింది. దీంతో పెట్టుబడి తడిసిమోపెడైంది. మిరప నాట్లు మొదలు నుంచి కోత కోసే వరకు ఎకరానికి రూ.1,80,000 పెట్టుబడి రూపంలో రైతులు ఖర్చు చేశారు. ప్రకృతి వైపరీత్యాలు, తెగుళ్ల ధాటికి ఎకరానికి 8 నుంచి 12 క్వింటాళ్ల దిగుబడి మాత్రమే రావడంతో రైతులు మద్దతు ధరపై ఆశలు పెంచుకున్నారు. కానీ రైతుల అంచనాలను మార్కెట్ తలకిందులు చేసింది. గత ఏడాది క్వింటా మిర్చి ధర రూ.18 వేల నుంచి రూ.21 వేలు పలికితే ఈ ఏడాది క్వింటా రూ.10 వేలకు అమ్మడానికే గుంటూరు మార్కెట్ యార్డ్ చుట్టూ ప్రదక్షిణ చేయాల్సిన దుస్థితి ఏర్పడింది.



పొలంలో కోతకోసి పెట్టిన మిరపకాయలు



చివరి కోత కోయకుండానే వదిలివేసిన మిరప పొలం

ధర పూర్తిగా పడిపోయింది

ఎండు మిర్చి ధరలు రోజురోజుకూ పడిపోతున్నాయి. ఈ ఏడాది మిర్చి పంట సాగు చేసిన రైతులు తీవ్రంగా నష్టపోయారు. ఎకరానికి రూ.50 వేల నుంచి లక్ష రూపాయల వరకు నష్టం వచ్చింది. ప్రభుత్వం గిట్టుబాటు ధరకు మిర్చి కొనుగోలు చేసేందుకు చర్యలు తీసుకోవాలని కోరుతున్నాం.

– కంకర వెంకటరెడ్డి, ఆర్.కొత్తపల్లె, బేస్తవారిపేట

పెట్టుబడి పెరిగింది

ఈ ఏడాది మిర్చి పైరును నల్లి, తామర పురుగు, దోమ ఆశించడంతో పురుగు మందులు ఎక్కువగా వాడాల్సిన పరిస్థితి ఏర్పడింది. పెట్టుబడి బాగా పెరిగింది. పంట దిగుబడి కూడా తగ్గిపోయింది. రూ.లక్షన్నరకు పైగా పెట్టుబడి పెట్టాం. లాభాల సంగతి దేవుడెరుగు.. వచ్చిన నష్టాన్ని ఎలా పూడ్చుకోవాలో తెలియక రైతులు సతమతమవుతున్నారు.

– భాస్కర్‌రెడ్డి, వంగపాడు, బేస్తవారిపేట

చివరికోత.. అదనపు వాత!

ఎకరం మిర్చి కోతకు రకాన్ని బట్టి ఏడుగురు నుంచి 10 మంది వరకు కూలీలు అవసరం. గ్రామాల్లో మిర్చి కోతకు కూలీలు అందుబాటులో లేకపోవడంతో ఇతర గ్రామాల నుంచి కూడా రప్పించుకున్నారు. ఒక్కో కూలీకి రూ.400 నుంచి రూ.450 వరకు ఇచ్చారు. వీరి ఆటో బాడుగలు కూడా రైతులే చెల్లించారు. ఇప్పటికి రెండు కోతలు పూర్తయ్యాయి. మూడో కోతకు మిర్చి సిద్ధంగా ఉన్నా రైతులు మాత్రం సాహసించడం లేదు. రెండు కోతలతో వచ్చిన కాస్త నగదు కూలీలకు, పురుగు మందుల దుకాణంలో అప్పులకు కూడా సరిపోలేదని రైతులు చెబుతున్నారు. ఈ పరిస్థితుల్లో మూడో కోత కోస్తే కూలీల ఖర్చు కూడా చేతికి రాదని రైతులు పొలాల్లోనే మిర్చిని వదిలేస్తున్నారు. పొలం కౌలు చెల్లించడం కోసం అదనంగా అప్పు చేయాల్సిన పరిస్థితి దాపురించిందని రైతులు ఆవేదన చెందుతున్నారు.

డెంగీతో ఏలూరు మాజీ సర్పంచ్ మృతి

- అలస్యంగా వచ్చిన రిపోర్టులో డెంగీ పాజిటివ్ అని నిర్ధారణ

పొదిలి రూరల్: పొదిలి మండలంలోని ఏలూరు గ్రామ మాజీ సర్పంచ్ ధర్మవరపు సుబ్బారెడ్డి(75) నాలుగు రోజుల క్రితం జ్వరంతో మృతి చెందారు. తొలుత కుటుంబ సభ్యులు సాధారణ మృతిగా భావించగా, ఆలస్యంగా అందిన వైద్య పరీక్షల నివేదికలో మాత్రం డెంగీ జ్వరంగా నిర్ధారణ అయింది. ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన ఈ సంఘటన గ్రామంలో కలకలం రేపింది. రెండు పర్యాయాలు గ్రామ సర్పంచ్‌గా పని చేసిన ధర్మవరపు సుబ్బారెడ్డి గత కొన్ని రోజులుగా అనారోగ్యంతోపాటు గుండెనొప్పితో బాధపడుతూ ఒంగోలులోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందారు. వైద్యులు అన్ని రకాల పరీక్షలు చేశారు. వైద్య పరీక్షల రిపోర్టులు ఆలస్యం కావడం, ఈలోగా ఆయన ఆరోగ్యం క్షీణించడంతో మృతి చెందారు. ఆలస్యంగా అందిన రిపోర్టులో సుబ్బారెడ్డికి డెంగీ పాజిటివ్ అని పేర్కొనట్లు కుటుంబ సభ్యులు వెల్లడించారు. దీంతో అప్రమత్తమైన వైద్యాధికారులు గ్రామంలో ప్రత్యేక వైద్యశిబిరం ఏర్పాటు చేసి రక్త నమునాలు సేకరిస్తున్నారు. పారిశుధ్య సిబ్బందితో గ్రామంలో మురుగు కాలువలు శుభ్రం చేయించడంతోపాటు ఎబేట్ పిచికారీ చేయించారు.



ఏలూరులో పారిశుధ్య పనులు చేస్తున్న సిబ్బంది

పొట్టిశ్రీరాములు త్యాగం మరువలేం

- కలెక్టర్ తమీమ్ అన్సారియా

కనిగిరిరూరల్: అమరజీవి పొట్టి శ్రీరాములు త్యాగం ఎప్పటికీ మరువలేమని కలెక్టర్ తమీమ్ అన్సారియా అన్నారు. అమరజీవి పొట్టిశ్రీరాములు మెమోరియల్ ట్రస్టు ఆధ్వర్యంలో బుధవారం కనిగిరి ఎంబీఆర్ కల్యాణ మండపంలో పొట్టిశ్రీరాములు జయంతి ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. తొలుత అమరజీవి పొట్టిశ్రీరాములు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ పొట్టిశ్రీరాములు జయంతి ఉత్సవాలను కనిగిరిలో నిర్వహించడం సంతోషంగా ఉందన్నారు. పీసీపల్లి మండలం పడమటిపల్లె గ్రామం అమరజీవి పొట్టిశ్రీరాములు పూర్వీకులది కావడం జిల్లా ప్రజల అదృష్టంగా భావించవచ్చన్నారు. ఆయన త్యాగం వల్లే తెలుగు వారికి ప్రత్యేకంగా రాష్ట్రాన్ని ఏర్పాటు చేశారన్నారు. కనిగిరి ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు నరసింహారెడ్డి, ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్, గిద్దలూరు ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి మాట్లాడుతూ అమరజీవి పొట్టి శ్రీరాములు ఈ ప్రాంత వాసులు కావడం ఎంతో సంతోషకరమన్నారు. ఆయన ఆశయాలకు అనుగుణంగా ప్రతి ఒక్కరూ ముందుకు సాగాలన్నారు. ఏపీ పర్యాటక శాఖాభివృద్ధి సంస్థ చైర్మన్ డాక్టర్ నూకసాని బాలాజీ మాట్లాడుతూ పొట్టిశ్రీరాములు జీవిత చరిత్రను తప్పనిసరిగా పాఠ్యపుస్తకాల్లో చేర్చాల్సిన అవసరం ఉందన్నారు. ఏపీ మాలల వెల్ఫేర్ కో ఆపరేటివ్ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ డాక్టర్ విజయ్‌కుమార్ మాట్లాడుతూ అమరజీవి పొట్టి శ్రీరాములు కేవలం ఆర్యవైశ్యులకు చెందిన వ్యక్తి కాదని, ఆయన జాతి సంపద అన్నారు.

కార్యక్రమానికి ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్మన్ రాకేష్ అధ్యక్షత వహించారు. అనంతరం పొట్టిశ్రీరాములు వారసులను సన్మానించారు. కార్యక్రమంలో ట్రస్టు సభ్యులు, ఆర్యవైశ్యులు, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.



పొట్టిశ్రీరాములు విగ్రహానికి నివాళులర్పిస్తున్న కలెక్టర్ తమీమ్ అన్సారియా

పగలగొడితే.. పొడుచుకుంటా..!

- దేవదాయ స్థలంలో అక్రమ కట్టడాలంటూ తొలగించే ప్రయత్నం
- గడ్డపారతో పొడుచుకుంటానని స్థల యజమాని పద్మావతి ఆగ్రహం

సింగరాయకొండ: 'మీరు ఏ గడ్డ పారతో నా రూంలు ధ్వంసం చేస్తున్నారో అదే గడ్డపారతో నేను పొడుచుకొని ఆత్మహత్య చేసుకుంటానంటూ స్థల యజమాని రంగని పద్మావతి దేవదాయశాఖ అధికారులను హెచ్చరించింది. దీంతో దేవదాయ శాఖ అధికారులు వెనుదిరిగారు. వివరాల్లోకి వెళితే..మండల కేంద్రంలోని కూరగాయల మార్కెట్ సెంటర్లో సర్వే నంబర్ 605–ఏ–ఏలో 0.02 సెంట్ల దేవాదాయభూమిలో నిర్మించిన భవనాలను అక్రమ కట్టడాలంటూ దేవాదాయశాఖ అధికారులు ఒంగోలు దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ పానకాలరావు ఆదేశాలతో ఇన్‌స్పెక్టర్, 9 మంది ఈఓలు, 7 గురు సిబ్బందితో కలిపి 17 మంది సదరు స్థలంలో ఉన్న నిర్మాణాలను జేసీబీతో ధ్వంసం చేసే ప్రయత్నం చేశారు. దీంతో వారిని స్థల యజమాని రంగని పద్మావతి అడ్డుకోవటంతో గడ్డపారలతో కట్టడాలు తొలగించేందుకు ప్రయత్నించారు. దీంతో పద్మావతి గడ్డపార లాక్కొని కడుపులో పొడుచుకొని ఆత్మహత్యయత్నానికి ప్రయత్నించింది. దీంతో అధికారులు గడ్డపార లాక్కొని అక్కడ నుంచి వెనుదిరిగారు. దీనిపై ఈఓ కృష్ణవేణి మాట్లాడుతూ దేవదాయ స్థలంలో కట్టడాలు నిర్మించారని, రెండుసార్లు నోటీసులు ఇచ్చినా తొలగించకపోవడంతో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు వచ్చామన్నారు. మరోసారి పోలీసు బందోబస్తుతో వచ్చి ఆ కట్టడాలను తొలగిస్తామని చెప్పారు.



గడ్డపారతో కడుపులో పొడుచుకునే ప్రయత్నం చేస్తున్న పద్మావతి

వ్యాళి వాహనంపై వామనుడిగా చెన్నకేశవుడు

మార్కాపురం టౌన్: శ్రీదేవి, భూదేవి సమేత శ్రీలక్ష్మీ చెన్నకేశవస్వామి బ్రహ్మోత్సవాలు రంగరంగ వైభవంగా సాగుతున్నాయి. బుధవారం రాత్రి స్వామివారు వామన అలంకారంలో వ్యాళి వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ అర్చకులు శ్రీపతి అప్పనాచార్యులు, అర్చక బృందం ఉభయ దేవేరులను ఉత్సవ పీఠంపై ప్రతిష్ఠించి అర్చన, నివేదన, మంగళహారతి ఇచ్చారు. మాఢ వీధుల్లో స్వామివారి నగరోత్సవాన్ని భక్తులు కనులారా తిలకించి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. బ్రహ్మోత్సవ ఏర్పాట్లను ఆలయ ఈవో జి.శ్రీనివాసరెడ్డి, ఆలయ సిబ్బంది పర్యవేక్షించారు. కాగా గురువారం రాత్రి స్వామివారు పొన్నవాహనంపై మురళీకృష్ణ అలంకారంలో భక్తులకు దర్శనమివ్వనున్నారు.



వామన అలంకారంలో శ్రీలక్ష్మీచెన్నకేశవస్వామి

హత్య కేసులో ఇద్దరికి జీవిత ఖైదు

ఒంగోలు: హత్య కేసులో ఇద్దరు నిందితులకు జీవిత ఖైదు విధిస్తూ జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎ.భారతి బుధవారం తీర్పు వెల్లడించారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం.. మద్దిపాడు మండలం పెదకొత్తపల్లికి చెందిన గొట్టిపాటి రామారావు, అతనికి సమీప బంధువైన నల్లూరి వెంకటరావు కుటుంబ సభ్యుల మధ్య 4 గదుల ఖాళీ స్థలానికి సంబంధించి గత కొన్నేళ్లుగా వివాదం నడుస్తోంది. 2018 అక్టోబర్ ఒకటో తేదీ ఉదయం 7.50 గంటల సమయంలో రామారావు తన ఖాళీ స్థలంలో ట్రాక్టర్ డ్రైవర్‌తో కలిసి కూరగాయల మొక్కలకు పందిరి వేసేందుకు కర్రలు పాతడం మొదలుపెట్టాడు. దీనిని గమనించిన నల్లూరి వెంకట్రావు, నల్లూరి సురేష్, నల్లూరి రాజ్యలక్ష్మి కర్రలతో దాడిచేయగా రామారావు స్పృహ తప్పి పడిపోయాడు. కుటుంబసభ్యులు చికిత్స నిమిత్తం ఒంగోలు రిమ్స్‌కు తరలించారు. మెరుగైన చికిత్స నిమిత్తం కిమ్స్ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ అక్టోబరు 3న రామారావు మృతి చెందాడు. దీనిపై మద్దిపాడు ఎస్సై పి.సురేష్ కేసు నమోదు చేయగా అప్పటి రూరల్ సీఐ ఒ.దుర్గాప్రసాద్ కేసు విచారించి కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. నిందితులు నల్లూరి వెంకట్రావు, నల్లూరి సురేష్‌పై నేరం నిరూపితం కావడంతో జీవిత ఖైదుతోపాటు రూ.5 వేల చొప్పున జరిమానా విధిస్తూ జిల్లా ప్రధాన న్యాయమూర్తి తీర్పు చెప్పారు. మరో నిందితురాలు రాజ్యలక్ష్మిపై నేరం నిరూపితం కాలేదని పేర్కొంటూ ఆమెపై అభియోగాన్ని కొట్టివేశారు. సకాలంలో సాక్షులను కోర్టులో హాజరుపరిచి నిందితులకు శిక్ష పడేలా కృషి చేసిన పోలీస్ అధికారులు, సిబ్బందిని ఎస్పీ ఏఆర్ దామోదర్ అభినందించారు.

బెల్ట్ షాపు కోసం తన్నుకున్న తెలుగు తమ్ముళ్లు

- ఘర్షణలో ఏడుగురికి తీవ్ర గాయాలు

యర్రగొండపాలెం: మద్యం బెల్ట్ షాపు కోసం టీడీపీలోని ఇరువర్గాలు పరస్పరం దాడి చేసుకున్న సంఘటన బుధవారం త్రిపురాంతకం మండలంలోని మిట్టపాలెంలో చోటుచేసుకుంది. ఈ దాడిలో ఏడుగురికి గాయాలయ్యాయి. వివరాలు.. గ్రామంలో మద్యం బెల్ట్ షాపు ఏర్పాటు కోసం అనధికారికంగా వేలం నిర్వహించుకున్నారు. వేలంలో ఓ వర్గానికి దుకాణం దక్కగా, రెండో వర్గం వారు గ్రామ కట్టుబాటును కాదని మరో బెల్ట్ షాపు నిర్వహించుకుంటున్నారు. ఈ నేపథ్యంలో ఇరువర్గాల మధ్య వివాదం ముదిరి ఘర్షణకు దారి తీసింది. రాళ్లు, కర్రలతో పరస్పరం దాడి చేసుకున్నారు. ఘర్షణలో వై.శ్రీనివాసరావు, పి.హనుమంతరావు, పి.ఆంజనేయులు, ఓట్ల మధవి, వై.మల్లికార్జున్, పి.సుబ్బారావు, వి.శ్రీనివాసరావుకు తీవ్రంగా గాయాలయ్యాయి. క్షతగాత్రులు యర్రగొండపాలెంలోని ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స పొందుతున్నారు. త్రిపురాంతకం పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.



గాయాలపాలైన ఒక వర్గం

నేర పరిశోధనలో పోలీసు జాగిలాల పాత్ర అమోఘం

- ఎస్పీ ఏఆర్ దామోదర్

ఒంగోలు టౌన్: 'పోలీసు శాఖలో డాగ్ స్క్వాడ్ ఒక ముఖ్యమైన విభాగం. నేర పరిశోధనలో పోలీసు జాగిలాల పాత్ర అమోఘం' అని ఎస్పీ ఏఆర్ దామోదర్ పేర్కొన్నారు. బుధవారం జిల్లా పోలీసు కార్యాలయంలోని డాగ్ స్క్వాడ్ విభాగాన్ని ఎస్పీ సందర్శించారు. జాగిలాలకు సంబంధించిన వివరాలను డాగ్ హ్యాండ్లర్లను అడిగి తెలుసుకున్నారు. పేలుడు పదార్థాలను పసిగట్టే 4 జాగిలాలు, అలాగే రెండు క్రైమ్ ట్రాకర్స్ పనితీరును స్వయంగా పరిశీలించారు. వేసవి తీవ్రత దృష్ట్యా జాగిలాలు ఇబ్బంది పడకుండా ఐదు కొత్త కూలర్లను అందజేశారు. నేర విచారణలో మరింత క్రియాశీలకంగా వ్యవహరించేలా జాగిలాలకు మెళకువలు నేర్పించాలని చెప్పారు. జాగిలాల ఆరోగ్యంపై శ్రద్ధ తీసుకోవాలని డాగ్ స్క్వాడ్ అధికారులను ఆదేశించారు. డాగ్ హ్యాండ్లర్ల సమస్యలు తెలుసుకున్న ఎస్పీ వాటిని పరిష్కరించడానికి చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. అనంతరం పోలీస్ క్యాంటీన్, జిమ్, హోంగార్డ్ కార్యాలయం, బ్యారక్, వాటర్ ప్లాంట్లను ఎస్పీ తనిఖీ చేశారు. ఎస్పీ వెంట ఏఆర్ అడిషనల్ ఎస్పీ అశోక్ బాబు, ఏఆర్ డీఎస్పీ శ్రీనివాసరావు, ఆర్‌ఐలు సీతారామిరెడ్డి, రమణారెడ్డి ఉన్నారు.



పోలీసు జాగిలాలను పరిశీలిస్తున్న ఎస్పీ దామోదర్

పిడుగుపాటుకు నలుగురికి గాయాలు

అర్ధవీడు: పొలంలో మిరప పుల్లలు ఏరుకునేందుకు వెళ్లిన నలుగురు కూలీలు పిడుగుపాటుకు గురై గాయాల పాలైన ఘటన బుధవారం సాయంత్రం మండలంలోని యాచవరంలో చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన తలుపుల బాలకాశయ్య, కోటి లింగమ్మ, మార్కొండరాయుడు, లక్ష్మయ్య పొలంలో మిరప పుల్లలు ఏరుకుంటుండగా వర్షం పడటంతో నలుగురూ చెట్టుకిందకు వెళ్లారు. ఆ సమయంలో పిడుగుపడటంతో వారికి గాయాలయ్యాయి. స్థానికులు వారిని ప్రైవేటు వైద్యశాలలో చేర్చారు. గాయపడిన వారిని మార్కాపురం సబ్‌కలెక్టర్ వెంకట త్రివినాగ్ పరామర్శించారు.



గాయపడిన వారిని పరామర్శిస్తున్న సబ్‌కలెక్టర్ త్రివినాగ్

బైక్ అదుపుతప్పి యువకుడు మృతి

గిద్దలూరు రూరల్: బైక్ నుంచి కిందపడి ఓ యువకుడు మృతి చెందిన సంఘటన నంద్యాల రోడ్డులోని మోడంపల్లె క్రాస్ రోడ్డు వద్ద బుధవారం రాత్రి చోటుచేసుకుంది. వివరాలు.. కేఎస్ పల్లె గ్రామానికి చెందిన దాసరి సుందర్(34) గత ఏడేళ్లుగా గిద్దలూరు అటవీశాఖ పరిధిలోని గుండ్లకమ్మ రేంజ్‌లో ఒప్పంద కార్మికుడిగా పనిచేస్తున్నాడు. కుటుంబ సభ్యులతో కలిసి గిద్దలూరు పట్టణంలోని నల్లబండ బజారులో నివాసం ఉంటున్నాడు. గిద్దలూరు నుంచి స్వగ్రామం కేఎస్ పల్లెకు వెళ్తుండగా బైక్ అదుపుతప్పి రోడ్డుపై పడిపోవడంతో తలకు తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య, ఒక కుమార్తె ఉన్నారు. సంఘటనా స్థలాన్ని పోలీసులు పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గిద్దలూరు ఏరియా వైద్యశాలకు తరలించారు.



మృతి చెందిన సుందర్‌రాజు